క్లుప్తంగా

సీతారాముల విగ్రహ ప్రతిష్ట

పుల్లంపేట: మండల పరిధిలోని కోనెయ్యగారి పల్లిలో ఈ నెల 4,5,6వ తేదీల్లో శ్రీ సీతారాముల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. 4న సాయంత్రం అంకురార్పణ, 5న హోమం, 6వ తేదీ శ్రీ సీతారాముల విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ప్రజలందరూ ఈ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని వారు కోరారు.

బాలిక ఆచూకీ లభ్యం



బాలికను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్‌ఐ, సిబ్బంది

సుండుపల్లె: మండల పరిధిలోని సిద్దారెడ్డిగారి పల్లికి చెందిన షేక్ అమీద(6) అనే బాలిక కనిపించకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సుండుపల్లి ఎస్‌ఐ శ్రీనివాసులు సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టి ఊరికి దూరంగా ఆడుకుంటున్న బాలికను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. దీంతో బాలిక తల్లిదండ్రులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది బీడీ నాయక్, రాజు, రవి పాల్గొన్నారు.

భైరవుడికి విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో కాలభైరవుడు

రాయచోటి టౌన్ : రాయచోటి రూరల్ పరిధిలోని యండపల్లె సమీపంలోని కొండపై వెలసిన శ్రీ కాలభైరవుడికి విశేష పూజలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు. కార్తీక మాసం కావడంతో ఆదివారం స్వామి ఆలయానికి ఎదురుగా హోమం నిర్వహించారు. అనంతరం అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అలాగే స్వామి వారికి అఖండ దీపం వెలిగించారు. ఈ దీపం కార్తీక మాసం పూర్తయ్యే వరకు ఈ అఖండ దీపం వెలిగుతూనే ఉంటుందని ఆలయ అర్చకులు తెలిపారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



అమ్మవారిని దర్శించుకొనేందుకు వచ్చి భక్తులు

సంబేపల్లె : మండల కేంద్రంలోని శ్రీ దేవరరాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయాన్ని వేపాకులతో శుద్ధి చేశారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేకపూజలు, అభిషేకాలు అర్చనలు చేశారు. ఆలయంలోని బీజాక్షరాలతో కొలువైన మహిమగల రాయిపై భక్తులు పొల్లు దండాలు పెట్టారు. సుదూర ప్రాంతం నుంచి వచ్చిన భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో మల్లూరమ్మ

చిన్నమండెం : మండల పరిధిలోని మల్లూరు గ్రామం మాండవ్యానది ఒడ్డున వెలసిన శ్రీ మల్లూరమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం కావడంతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని బోనాలు సమర్పించారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు.

భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు



చౌడయ్య (ఫైల్)

చిన్నమండెం : తన భర్త కనిపించడం లేదంటూ ఓ వివాహిత పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేసింది. మొడెం చౌడయ్య, మొడెం కుమారి భార్యాభర్తలు. మండల పరిధిలోని మల్లూరు గ్రామం కొడిదెపల్లికు చెందిన మొడం చౌడయ్య (44) ఈ నెల 3వ తేదీ నుంచి కనిపించడం లేదని, చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు బంధువుల ఇండ్ల లోనూ వెతికినా ఆచూకి తెలియక పోవడంతో కుమారి పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జూదరుల అరెస్ట్

ఒంటిమిట్ట: పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఒంటిమిట్ట ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని కొత్తపల్లి శివారులో పేకాట ఆడుతున్న స్థావరాలపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడుల్లో పేకాట ఆడుతున్న ఐదుగురు జూదరుల నుంచి రూ. 11,050 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు.

కొనలేం.. తినలేం!

- భగ్గుమంటున్న కూరగాయలు
- పెరుగుతున్న వంట నూనెల ధరలు
- ఆందోళనలో ప్రజలు

ఏం కొనేటట్టు లేదు..ఏం తినే టట్టు లేదు.. అన్న ఓ సినీగేయానికి తగ్గట్టుగా నిత్యావసర సరుకులు, కూరగాయల ధరలు చుక్కలు తాకుతున్నాయి. నెల రో లుగా నిత్యావసర వస్తువులు, కాయగూరల ధరలు పెరుగుతునే ఉన్నాయి. డిమాండ్‌కు తగ్గట్టుగా సరఫరా లేక పోవడంతో ధరలు పైపైకి పోతున్నాయి. కొద్దిరోజులుగా ఊహించలేని స్థాయిలో ధరలు పెరుగుతుండడంపై సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



గాలివీడు : సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఏం కొనేటట్టు లేదు. ఏం తినేటట్టు లేదు. నిత్యావసర సరుకులతో పాటు కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతుండటంతో పేదల జీవనం కష్టంగా మారింది. వంట నూనెల ధరలు సైతం రోజురోజుకు పెరిగిపోతున్నాయి. అయినా ధరల నియంత్రణకు కూటమి ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. వంట నూనెల ధరలకు రెక్కలొచ్చాయి. 10 నుంచి 20 శాతం జీఎస్టీ పెంచడంతో వంటనూనెల ధరలు కూడా భారీగా పెరిగాయి. గత ప్రభుత్వంలో పామాయిల్ లీటర్ రూ.85 నుంచి రూ.80 వరకు ఉండగా ప్రస్తుతం రూ.180 నుంచి రూ.135కు ఎగబాకాయి. లీటర్ సన్‌ఫ్లవర్ ఆయిల్ రూ.115 నుంచి రూ.140కు పెరిగింది. వేరుశనగ నూనె లీటర్ రూ.140 నుంచి రూ.150 చేరింది. ఇక కంది పప్పు తాండూర్ రకం రూ.150 నుంచి రూ.160, వెల్లుల్లి కిలో రూ.360 నుంచి రూ.460 పెరగడంతో పాటు సబ్బుల ధరలు సైతం విపరీతంగా పెరిగాయి. బియ్యం 48 కిలోలు నంద్యాల సోనమసూరి రూ.3,300, కర్నూలు సోనా రూ.2,900 నుంచి రూ.3,000 దాకా ధరలు పలుకుతున్నాయి.

సమాన్యుడి నడ్డి విరుస్తున్న ధరలు

టీడీపీ ప్రభుత్వం వస్తే నిత్యావసరసరుకుల ధరలు తగ్గుతాయని భావించిన ప్రజలకు ప్రస్తుత ధరలు మింగుడు పడటం లేదు. ఏది కొనాలన్నా ధరలు ఆకాశాన్ని అంటుతుండటంతో కార్తీక మాసంలో పండగలకు ఎలా చేసుకోవాలని సామాన్య, మధ్య తరగతి ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెక్కెర ధర పెరగడంతో బెల్లం విక్రయాలు ఎక్సైజ్ అధికారుల ఆదేశాలకు విరుద్ధంగా అధిక రేటుకు విక్రయిస్తున్నారు. ఇక కూరగాయల ధరలు గత వారం కంటే ఈ వారం భారీగా పెరిగాయి. టమాటా కిలో రూ.15 నుంచి రూ. 30, మిర్చి రూ.25 నుంచి రూ.40, ఉల్లి రూ.60 దాకా, బెండ, క్యాబేజ్, బంగాళదుంపలు రూ.60 నుంచి రూ.80 దాకా ధరలు పలుకుతున్నాయి. రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర ధరలు సమాన్యుడి నడ్డి విరుస్తున్నాయి. రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు



చేసి మార్కెట్లో మాత్రం వినియోగదారులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. దీంతో మార్కెట్లో కూరగాల ధరలు ఆకాశాన్నంటుతున్నా రెక్కల కష్టంతో పండించిన అన్నదాతలకు మాత్రం ఆశించిన లాభాలు రావడం లేదు. ఒక వైపు వర్షాలు, మరో వైపు వ్యాపారుల మోసాలకు రైతన్నలు అప్పుల పాలవుతున్నారు.

ధరలను నియంత్రించాలి



సామాన్యులకు అందుబాటులో ధరలను ఉంచాలి. రోజురోజుకు నిత్యావసర సరుకుల ధరలను పెంచుతూ పోతే సామాన్యులు ,మధ్య తరగతి కుటుంబాలు ఎలా జీవనం గడుపుతారు. నెలకు రూ.10 వేల నుంచి రూ.20 వేల జీతం సంపాదించే చిరుద్యోగుల పరిస్థితి ఏమిటి. నియంత్రణపై దృష్టి పెట్టాలి.

– హరి, గాలివీడు

దడ పుట్టిస్తున్నాయి



గతేడాదితో పోలిస్తే ప్రస్తుత ఏడాది పెరిగిన కూరగాయల ధరలు దడ పుట్టిస్తున్నాయి. మార్కెట్‌కు వెళ్లి కొనుగోలు చేద్దామంటే ఆర్థికంగా ఇబ్బందిగా మారుతోంది. పెరుగుతున్న ధరలను నియంత్రించాలి. సామాన్యులకు సైతం కూరగాయల ధరలు అందుబాటులో ఉంచాలి.

–వెంకటేశ్వర్లు, గాలివీడు

పట్టుదలతో చదివితేనే విజయం



మాట్లాడుతున్న మహమ్మద్ హాషీం

రాయచోటి అర్బన్: పట్టుదలతో చదివితే విజయాలు సొంతమవుతాయని అంజుమన్ తరఖ్ఖి ఉర్దూ జిల్లా కార్యదర్శి మహమ్మద్ హాషీం అన్నారు. అంజుమన్ తరఖ్ఖి ఉర్దూ జిల్లాశాఖ ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ జెడ్పీ ఉర్దూ హైస్కూల్స్ విద్యార్థులకు విద్యారంగానికి మౌలానా ఆజాద్ చేసిన సేవలు, ఇంటర్ విద్యార్థులకు ఇక్బాల్ యొక్క దేశ భక్తి అనే అంశంలపై వకృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి పోటీల్లో పాల్గొనడం వలన ప్రముఖుల జీవిత చరిత్రలపై అవగాహన ఏర్పడుతుందన్నారు. పోటీల్లో నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాలలోని ఉర్దూ ఉన్నత పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు నవంబరు 9,10 తేదీల్లో కడప నాగరాజుపేటలోని మహిళా డిగ్రీ కళాశాలలో జరుగనున్న ఉర్దూ జాతీయస్థాయి సెమినార్‌లో బహుమతులను ప్రదానం చేయనున్నారు. కార్యక్రమంలో రూటా నేతలు సిబాతుర్ రహిమాన్, మున్వర్‌బాషా, అసదుల్లాబాషా, ఖదీర్ పర్వేజ్, జాకీర్ అహమ్మద్, సికిందర్‌బాషా పాల్గొన్నారు.

బహుజనులు సత్తా చాటాలి



మాట్లాడుతున్న గౌతంకుమార్

రాయచోటి అర్బన్: బహుజనులంతా ఐక్యమై రాజ్యాధికారాన్ని దక్కించుకునేందుకు సత్తాను చాటాలని బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలో బీఎస్పీ జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జిల్లాలో బీఎస్పీ ఆధ్వర్యంలో బహుజనులంతా ఐక్యమై రాజకీయంగా బలపడాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతానికి నాయకులంతా కృషి చేయాలని కోరారు.

జిల్లా నూతనకమిటీ ఎంపిక

అన్నమయ్య జిల్లా బీఎస్పీ నూతన కమిటీని గౌతం కుమార్ అధ్యక్షతన ఎన్నుకున్నారు. జిల్లా కమిటీ అధ్యక్షుడిగా అబ్బవరం యుగంధర్, కార్యదర్శిగా మహేష్‌బాబు, కోశాధికారిగా గంగాధర్, ఆర్గనైజింగ్ సెక్రటర గా శివకుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నియోజకవర్గస్థాయి కమిటీల ఏర్పాటు తర్వాత జిల్లాకమిటీని పూర్తి స్థాయిలో విస్తరించనున్నట్లు గౌతం కుమార్ తెలిపారు. పలువురు బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేస్తున్న దాతలు

రాజంపేట రూరల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి వై. నందకిషోర్‌గౌడ్ తెలిపారు. స్థానిక ఫ్యూచర్ మైండ్స్ స్కూల్‌లో కరస్పాండెట్, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి నందకిషోర్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నందకిషోర్‌గౌడ్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి రక్తదానం చేయడాన్ని ప్రతి ఒక్కరు బాధ్యతగా భావించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు టి. రమణారెడ్డి, పి.వి రమణ, రాయుడు, బి. వేణుగోపాల్‌నాయుడు, పి.సి యస్. మూర్తి, కె.వి.ఎస్ వర్మ, రమణ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయానికి భక్తుల తాకిడి



ప్రత్యేక అలంకారంలో గంగమ్మ తల్లి

లక్కిరెడ్డిపల్లి: భక్తులు వేలాదిగా తరలిరావడంతో ఆదివారం అనంతపురం గంగమ్మ తల్లి ఆలయ ప్రాంగణం జాతరను తలపించింది. భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించి తలనీలాలు అర్పించారు. ఆలయంలోని అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. లక్కిరెడ్డిపల్లి సీఐ వెంకట కొండారెడ్డి, ఎస్ఐ రవీంద్రబాబు, సిబ్బందితో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. చెల్లువంశీయులైన పూజారులు రవి, గంగాధర్, శ్రీనివాసులు భక్తులకు అమ్మవారి దర్శనాన్ని కల్పించి తీర్థప్రసాదాలను అందజేసి ఆలయ విశిష్టతను వివరించారు.ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

రాయచోటి టౌన్ : ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, మండిపల్లె రాంప్రసాద్ రెడ్డి, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డికి ఏపీయూఎస్ (ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం) అన్నమయ్య జిల్లా నాయకులు ఆదివారం వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యాయుల సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రులు పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి దివాకర్, జిల్లా అధ్యక్షులు నరసింహులు, ప్రధాన కార్యదర్శి రమణా రెడ్డి, ఆర్థిక కార్యదర్శి కె.శివశంకర్ పాల్గొన్నారు.

కొండను తవ్వి చదును చేశారు



కొండను చదును చేసిన ప్రాంతం

సిద్దవటం: మండలంలోని శాఖరాజుపల్లె రెవెన్యూ గ్రామం పరిధిలోని సర్వే నంబర్ 175లోని తిప్పన కొండను తవ్వి ఎకరామేర చదును చేశారు. ప్రభుత్వ కార్యాలయాలు సెలవురోజుల్లో డీకేటీ భూములను జేసీబీ యంత్రాలతో చదును చేశారు. ఈ విషయమై స్థానిక వీఆర్‌వో శివంకర్‌ను వివరణ కోరగా సర్వే నంబర్ 175లో గ్రావెల్ కోసం తవ్వకాలు జరిపి భూమి చదును చేసిన విషయాన్ని పరిశీలిస్తామని, ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. శాఖరాజుపల్లె డీకేటీ పొలంలో మరికొంత ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం చేసినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

పరామర్శ



అన్సర్ బాషాను పరామర్శిస్తున్న ఎంపీ మేడా రఘునాథరెడ్డి

వీరబల్లి: వీరబల్లి మండలం ఓదివీడు వైఎస్సార్‌సీపీ మైనార్టీ నాయకులు అన్సర్ బాషా అనారోగ్యంతో చికిత్స తీసుకుని ఇంటి దగ్గర విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి ఆదివారం ఓదివీడు వెళ్లి అన్సర్ బాషాను పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట వీరబల్లి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు గాలివీటి వీరనాగిరెడ్డి, నాయకులు మాదిరెడ్డి, సత్యనారాయణ రెడ్డి, అలీఖాన్, నరేష్ స్వామి, షాహీర్ బాషా, మాదిరెడ్డి నాగేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

బ్రిడ్జికి మరమ్మతులు చేయండి



బ్రిడ్జిని పరిశీలిస్తున్న సీఐటీయూ నాయకులు

పుల్లంపేట: పుల్లంపేట జాతీయ రహదారిపై సీతారాంపేట సమీపంలో ఉన్న పుల్లంగేరుపై నిర్మించిన హైవే బ్రిడ్జి కూలడానికి సిద్ధంగా ఉందని, మరమ్మతులు చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఆదివారం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ బ్రిడ్జిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్రిడ్జికి గండ్లు పడ్డాయని, భారీ వాహనాలు వెళ్లేటప్పుడు బ్రిడ్జి మొత్తం కదులుతూ ఊగుతోందని, అందువల్ల ఆర్‌అండ్‌బీ అధికారులు పరిశీలించి మరమ్మతులు నిర్వహించాలని కోరారు.

ఎన్‌ఎంయూఏ అధ్యక్షుడిగా ఎం.ఎన్.రావు

రాయచోటి అర్బన్: నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడిగా ఎం.ఎన్.రావు ఎన్నికయ్యారు. ఇటీవల మదనపల్లెలో జరిగిన ఎన్‌ఎంయూఏ అన్నమయ్య రీజియన్ సమావేశంలో కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎం.ఎన్ రావు, ఉపాధ్యక్షుడిగా టి.రామాంజులు, జాయింట్ సెక్రటరీలుగా ఎం.ఎస్. ప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా బి.ఆర్.బి. నాయక్, ప్రచార కార్యదర్శిగా ఎస్.ఏ. ఎం.బాషాను ఎన్నికయ్యారు.

కరువు మండలాలు ప్రకటించాలి

రాయచోటి: జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, రాష్ట్ర రోడ్లు భవనాలు, మౌళిక సదుపాయాలు, పెట్టుబడుల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అధ్యక్షతన, కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ ఆధ్వర్యంలో ఆదివారం అన్నమయ్య జిల్లా సమగ్ర అభివృద్ధి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఎమ్మెల్యేలు కరువు మండలాలను మరిన్ని ప్రకటించాలని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు.

పీలేరు ఎమ్మెల్యే.. :

పీలేరు నియోజకవర్గంలో కేవీ పల్లి మండలాన్ని కరువు మండలంగా గుర్తించాలని పీలేరు ఎమ్మెల్యే కిషోర్‌కుమార్‌రెడ్డి మంత్రి దృష్టికి తెచ్చారు. రీసర్వేలో తిరస్కరించిన భూముల విషయంలో తప్పు చేసిన అధికారులను శిక్షించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గుజ్జు పరిశ్రమల సిండికేట్ వలన మామిడిపంటను పండించే రైతులు నష్టపోతున్నారని దీనిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

మదనపల్లి ఎమ్మెల్యే..

రామసముద్రం మండలాన్ని కరువు మండలంగా గుర్తించాలని.. మదనపల్లిలో జరిగిన అక్రమ భూముల వ్యవహారాన్ని త్వరగా విచారణ చేసి తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ సమావేశం దృష్టికి తెచ్చారు. కాగా కలెక్టర్ స్పందిస్తూ.. ఎమ్మెల్యేలు కోరిన విధంగా మరొకసారి అన్ని మండలాలపై సమీక్షించి మరిన్ని మండలాలను కరువు మండలాలుగా గుర్తించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. రీసర్వే ప్రక్రియ ద్వారా బయటపడిన తప్పులు, ఆ తప్పులు చేసిన అధికారులపై చర్యలు తీసుకుంటామన్నారు.

పింఛన్లను తొలగిస్తున్నారు..

అర్హులైన వారికి కూడా వైఎస్‌ఆర్‌సీపీ కార్యకర్తలనే పేరుతో పింఛన్ తీసేశారని, దీనిపై తగిన చర్యలు తీసుకొని వారికి పెన్షన్ పునరుద్ధరించాలని పీలేరు, మదనపల్లి, రైల్వేకోడూరు ఎమ్మెల్యేలు కిషోర్‌కుమార్‌రెడ్డి, షాజహాన్, అరవ శ్రీధర్, ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డిలు కోరారు.

వైద్య శిబిరం విజయవంతం

లక్కిరెడ్డిపల్లి: మండలంలోని మద్దిరేవుల బిల్డింగ్ హరిజనవాడలో ఆదివారం దేవళంపల్లె వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్య శిబిరం విజయవంతమైంది. మంచం పట్టిన పల్లెలు అనే శీర్షిక సాక్షిలో కథనం రావడంతో ఆదివారం కస్తూర్బా గాంధీ పాఠశాలతో పాటు బిల్డింగ్ ఎస్సీ కాలనీలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దేవళంపల్లి పీహెచ్‌సీ సీఈఓ దీప్తి మాట్లాడుతూ ప్రజలు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఏ రోజు నీరు ఆరోజే వినియోగించాలని సూచించారు. వ్యక్తిగత పరిశుభ్రతపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామస్తులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దేవలంపల్లె వైద్య సిబ్బంది, సచివాలయం ఏఎన్‌ఎం విజయ కుమారి, ఆశా కార్యకర్త కళావతి, పంచాయతీ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న దేవళంపల్లి పీహెచ్‌సీ వైద్య సిబ్బంది

వైద్య శిబిరానికి విశేష స్పందన

సుండుపల్లె: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మానవతా సంస్థ సభ్యులు ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో 300 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. డాక్టర్లు బీఎస్ ప్రభు, రేష్మారెడ్డి, రవికృష్ణ, మానవతా సంస్థ సభ్యులు గంగిరెడ్డి, బాషా పాల్గొన్నారు.

మట్లిరాజుల కోటలో విద్యార్థుల సందడి



సిద్దవటం మట్లి రాజుల కోటను సందర్శించిన విద్యార్థులు, ఉపాధ్యాయులు

సిద్దవటం: మండల కేంద్రమైన సిద్దవటంలోని మట్లిరాజుల కోటను సందర్శించేందుకు ఆదివారం విద్యార్థులు తరలిరావడంతో కోటలో సందడి నెలకొంది. మైదుకూరు మండలం వనిపెంట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఆదివారం సెలవు కావడంతో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు మోహిద్దీన్‌ఖాన్ ఆధ్వర్యంలో విహార యాత్రకు వచ్చారు.ఈ సందర్భంగా వారు కోటలోని మొదటి, రెండవ మండపాలు, పార్కులు ఢంకా నగర్, ఈద్గా, కోనేరు, కామాక్షమ్మ గుడి, మూతి విరిగిన నంది విగ్రహం, తవ్వకాల్లో బయటపడిన శివలింగం, బిస్మిల్లా షా ఖాద్రి దర్గా, మసీదు , పెన్నానది నీటి ప్రవాహాన్ని తిలకించారు. దర్గాలో ప్రార్థనలు చేసి దర్గా విశిష్టతను తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొంచివున్న ప్రమాదం



ఫిల్లర్‌పై పెరుగుతున్న చెట్లు

రాజంపేట టౌన్: మొక్కై వంగనిది.. మానై వంగునా అన్న చందంగా ఉంది రాజంపేట పట్టణంలోని ఫ్లెటైవర్ బ్రిడ్జిపై పెరుగుతున్న చెట్ల పరిస్థితి. ప్రమాదం అనుకున్నదానిని ఆదిలోనే తుంచివేయాలి. లేదంటే అతి పెద్ద ప్రమాదానికే దారితీస్తుంది. ప్రస్తుతం ఫ్లెటైవర్‌పై పెరుగుతున్న చెట్ల వల్ల భవిష్యత్తులో బ్రిడ్జి దెబ్బతింటుందని పట్టణ వాసులు ఆందోళన చెందుతున్నారు. పట్టణంలోని సమద్ థియేటర్ నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు దాదాపు కిలోమీటరు దూరం వరకు ఉన్న ఫ్లెటైవర్‌పై ఇరువైపులా ఉన్న ఫిల్లర్లపై చెట్లు రోజు, రోజుకు ఏపుగా పెరుగుతున్నాయి. ఈచె ట్లు ఇలాగే పెరిగితే ఫిల్లర్లు దెబ్బతిని బ్రిడ్జి బీటలు వారే ప్రమాదం కూడా ఉంటుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఫ్లెటైవర్ బ్రిడ్జి ఫిల్లర్లపై మొక్కలు మొలచకుండానే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

అధికారులు స్పందించాలి

చెట్లు ఈలాగే పెరిగితే బ్రిడ్జి దెబ్బతినే ప్రమాదం ఉందని మండల కో–ఆప్షన్ మెంబర్ గౌస్ ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి చెట్లను తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

బోగస్ సర్టిఫికెట్లు ఏరివేయండి

రాయచోటి (జగదాంబసెంటర్) : రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖలో ప్రభుత్వ అనుమతులు లేని శిక్షణ సంస్థల పేరుతో చెలామణిలో ఉన్న మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ (మేల్) బోగస్ సర్టిఫికెట్లను నిషేధించి వెంటనే ఏరివేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి ఏపీ డీఎస్సీ కాంట్రాక్టు పారా మెడికల్ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విశ్వనాథరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ శిక్షణ సంస్థల్లో శిక్షణ తీసుకోని సర్టిఫికెట్లు ఉన్న వారిని రెగ్యులర్ చేయాలని కోరారు. స్పందించిన మంత్రులు సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేటట్లు చూస్తామని హామీ ఇచ్చారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



నవ వధువుకు తాళిబొట్టు, చీర, సారే అందజేస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి, జ్యోతమ్మ

రాజంపేట రూరల్: సుండుపల్లి మండలంలోని రామవాండ్లపల్లికి చెందిన పార్లపల్లి చంద్రాయుడు, హరిత, ఒంటిమిట్ట మండలం కోనరాసపల్లి గ్రామానికి చెందిన ముక్కార వెంకటాద్రి, అనూషలకు ఉచిత వివాహం జరిపించి వారిని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి ఆశీర్వదించారు. మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్ వద్ద ఉన్న వేంకటేశ్వరస్వామి దేవాలయ సముదాయాలలో ఆదివారం ఎమ్మెల్యే ఆకేపాటి వీరికి వివాహం జరిపించారు. నూతన వధూవరులకు ఎమ్మెల్యే ఆకేపాటి, జ్యోతమ్మ దంపతులు తాళిబొట్టు, చీర, సారే అందజేసి ఉచితంగా వివాహం జరిపించారు. అనంతరం వివాహానికి విచ్చేసిన వారికి ఎమ్మెల్యే ఆకేపాటి స్వయంగా అల్పాహారం అందజేశారు. ఈ వివాహ వేడుకలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆకేపాటితో మాజీ ఎమ్మెల్యే సుధాకర్‌బాబు భేటీ

ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డితో కర్నూలు జిల్లా కొడుమూరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే సుధాకర్‌బాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకులు సుధాకర్‌బాబు మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌లో ఆదివారం రాత్రి భేటీ అయ్యారు.